క్లుప్తంగా

సాహితీవేత్తలకు సత్కారం



నారాయణరావు, సందీప్ శర్మలను సత్కరించిన ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: రచయితల సమితి ఆధ్వర్యంలో నగరంలో శ్రీ కందుకూరి వీరేశలింగం పురమందిరం (టౌన్ హాలు)లో సాహితీవేత్త, రచయిత డాక్టర్ అరిపిరాల నారాయణరావు, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ తాతా సందీప్ శర్మలకు సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్కార గ్రహీత నారాయణరావు మాట్లాడుతూ ఆంధ్ర కేసరి కళా సమితి ద్వారా తాము చేసిన అనేక సత్కార్యాలు, కందుకూరి వీరేశలింగంపై పుస్తకం తేవడంలో చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. గతంలో తాను నిర్వహించిన అనేక సభలు ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు రావాలని కోరారు. డాక్టర్ తాత సందీప్ శర్మ మాట్లాడుతూ గతంలో పుష్కరాల్లో పది రోజులు తాను నిర్వహించిన సభలలో సాధక బాధకాల వివరించారు. ఈ కార్యక్రమంలో కళా గౌతమి వ్యవస్థాపకులు డాక్టర్ బీవీఎస్ మూర్తి, అధ్యక్షుడు డాక్టర్ పీవీబీ సంజీవరావు, కళాగౌతమీ కార్యదర్శి డాక్టర్ బీహెచ్ వీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుని బోధనలు అనుసరణీయం

కడియం: బుద్ధుని బోధనలు అనుసరణీయమని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. వేమగిరిలో రిటైర్డ్ ఉద్యోగి యార్లగడ్డ జగదీశ్వరరావు (మహోదయ యాజరా) ఆధ్వర్యంలో 84 అడుగుల భారీ బుద్ధ విగ్రహాన్ని నిర్మించారు. విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి, రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, పలువురు బౌద్ధభిక్షువులు పాల్గొన్నారు. మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసి, వారి గురించి ప్రస్తుత తరానికి అవగాహన కల్పిస్తున్న జగదీశ్వరరావును ఈ సందర్భంగా వారు అభినందించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన బౌద్ధ భిక్షువులు, బద్వేలు గురుమూర్తి, మార్గాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జెండాల పంపిణీ



జెండాలు పంపిణీ చేస్తున్న ఆస్క్ చైర్మన్ రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: విశ్వ మేధావి, భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 2000 జెండాలను తోరణాలను పంపిణీ చేసినట్లు అంబేడ్కర్ సేవా కేంద్రం (ఆస్క్) చైర్మన్ ఎ.రాంబాబు ఆదివారం తెలిపారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులకు ఈ జెండాలను అందించమన్నారు. నగరంలోని అంబేడ్కర్ అభిమానులందరూ సోమవారం ఉదయం విగ్రహాల వద్ద జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు. మధ్యాహ్నం మూడు గంటలకు క్వారీ మార్కెట్ సెంటర్ నుంచి గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వరకూ ఉత్సవ ర్యాలీలో జెండాలతో పాల్గొని జయప్రదం చేయాలని కోరార. జెండాలో కావలసినవారు స్వయంగా లాలాచెరువులోని అంబేడ్కర్ సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

సినిమాలు



శ్యామల	: గుడ్ బ్యాడ్ అగ్లీ
సూర్యమినీ	: బౌట్
సూర్యప్యాలెస్	: జాక్
స్వామి	: కోర్ట్
శివజ్యోతి	: గుడ్‌బ్యాడ్‌అగ్లీ
అనుశ్రీ	: జాక్
రాజా	: జాక్
ఊర్వశి	: ఎల్2ఎంపురాన్
మేనక	: చెరసాల
రంభ	: రాబిన్‌హుడ్
కుమారి	: అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
అప్సర	: మ్యాడ్‌స్క్వేర్
అశోక	: జాక్
నామవరం	
వివిస్‌మహల్	: జాక్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: జాక్
కడియం	
వెంకటసూర్య	: జాక్

పన్ను కట్టు.. రాయితీ పట్టు..

- ఈ నెల 30 వరకు గడువు
- ఆస్తిపన్ను బకాయిదారులకు 50 శాతం వడ్డీ రాయితీ
- 2025-26 పన్ను చెల్లింపుదారులకు 5 శాతం రాయితీ



రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

రాజమహేంద్రవరం సిటీ: ఇంత వరకూ ఆస్తి పన్ను కట్టలేదా అయితే వెంటనే కట్టేయండి నగరపాలక సంస్థ ఇచ్చిన రాయితీని పొందండి. ఈ అవకాశం ఈ నెల 30వ తేదీ వరకే ఉంటుంది. ఇంకా లేటెందుకు వెంటనే వెళ్లి చెల్లించి లాభాన్ని సొంతం చేసుకోండి.

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో ఆస్తి పన్ను చెల్లింపు, బకాయిదారులకు ప్రభుత్వం రాయితీ ప్రకటించింది. నగరంలోని ఆస్తి పన్నుదారులు, బకాయిదారులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని నగర పాలక సంస్థ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. పన్ను చెల్లింపుదారుల సౌకర్యం కోసం 2024-25 సంవత్సరం వరకూ ఆస్తి పన్ను చెల్లించిన బకాయిదారులకు ఆస్తి యజమానులు చెల్లించాల్సిన వడ్డీలో 50 శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ముందస్తుగా చెల్లింపు చేసినట్లయితే ఆస్తిపన్నులో 5 శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ అవకాశం ఈ నెల 30 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

రాజమహేంద్రవరం నగరంలో గృహ నిర్మాణాలకు సంబంధించి 80 వేల మంది ఆస్తి పన్ను చెల్లింపుదారులనుంచి రూ.45 కోట్లు రావాల్సి ఉంది. వీటిలో 2500 మంది ఆస్తి పన్నుదారులకు సంబంధించి రూ.23 కోట్లు పెండింగ్‌లో కొనసాగుతున్నాయి. ఆస్తి పన్ను చెల్లింపుదారులు 1750 మంది పన్ను చెల్లించగా రూ.12.45 కోట్ల వసూలైంది. ఇంకా 1420 ఆస్తి పన్నుదారులు రూ.9.77 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఆస్తి పన్ను బకాయిదారులు ఏకమొత్తంలో చెల్లింపు చేసినట్లయితే వారికి వడ్డీపై 50 శాతం రాయితీని కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సదుపాయం ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే పన్ను బకాయిలు లేకుండా వడ్డీ కట్టిన వారందరికి కూడా వర్తించేలా ఉత్తర్వులిచ్చారు.

పన్ను చెల్లించి.. అభివృద్ధికి తోడ్పడండి



ఆస్తి పన్ను చెల్లింపు దారులు, బకాయిదారులు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందండి. నగర పాలక సంస్థ అభివృద్ధికి తోడ్పడండి. సోమవారం అంబేడ్కర్ జయంతి రాష్ట్ర ప్రభుత్వ సెలవు దినమైనప్పటికీ ఆస్తి పన్నుల చెల్లింపులకు కౌంటర్లు ఏర్పాటు చేశాం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటిపన్ను, ఖాళీ స్థలాలపై గల పన్ను రెండు వాయిదాలు ఏకమొత్తంగా చెల్లించిన వారికి ఆస్తి పన్ను చెల్లింపులో 5 శాతం రాయితీ అందిస్తున్నాం. నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌంటర్లు యథావిధిగా పనిచేస్తాయి. పన్ను చెల్లింపు దారులు ఈ విషయాన్ని గమనించుకొని తాము చెల్లించాల్సిన పన్నులు పన్నేతరాలు చెల్లించి నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలి.

– కేతన్ గార్గ్, కమిషనరు, నగరపాలక సంస్థ

దాసరి సురేఖకు డాక్టరేట్



ఆచార్య రాజశేఖర్ నుంచి డాక్టరేట్ ఉత్తర్వులు అందుకుంటున్న దాసరి సురేఖ అరవలమ్మ

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆంధ్ర విశ్వవిద్యాలయం హ్యూమన్ జెనెటిక్స్ విభాగం నుంచి రాజమహేంద్రవరానికి చెందిన దాసరి సురేఖ అరవలమ్మకు డాక్టరేట్ లభించింది. ఆచార్య జి.పి రాజశేఖర్ నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను ఆదివారం ఆమె స్వీకరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం జన్యు శాస్త్ర విభాగం సీనియర్ ఆచార్యులు, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా సేవలందిస్తున్న ఆచార్య జి.సుధాకర్ పర్యవేక్షణలో తూర్పుగోదావరి జిల్లాలోని గర్భస్థ మధుమేహం టైప్ టూ మధుమేహం కలిగిన మహిళల మధ్య జన్యుపరమైన సారూప్యతలు, వ్యత్యాసాలపై చేసిన పరిశోధనకు గాను సురేఖకు డాక్టరేట్ లభించింది. తన పరిశోధనలో భాగంగా 600 మందిపై అధ్యయనం చేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా సురేఖను హ్యూమన్ జెనెటిక్స్ విభాగాధిపతి ఆచార్య వి.లక్ష్మి విభాగాచార్యులు, పరిశోధకులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



దామిరెడ్డిపల్లిలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

కడియం: దామిరెడ్డిపల్లి బైబిలు మిషన్ మహిమ మందిరం దైవజనులు, షారోను దైవిక స్వస్థతల శాల వ్యవస్థాపకులు రెవ. డా.దేవరపల్లి రత్నరాజు ఆధ్వర్యంలో మట్టల ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈత మట్టలకు పువ్వులను అలంకరించి వాటిని పట్టుకొని పురవీధుల్లో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సండే స్కూలు చిన్నారులు, బైబిల్ యూత్ సభ్యులు, సన్నిధి స్త్రీలు, దేవరపల్లి సరోజిని, స్వాతి, శ్యామల, సంధ్య, పరిమళ, అనిరుధ్, వివేక్, దేవకుమార్, విజయ, నాని పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ తదితరులు



చలివేంద్రం ప్రారంభించిన ప్రసాదరెడ్డి

మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆదివారం స్థానిక 28వడివిజన్ మంగళవారపుపేటలో వైఎస్సార్ సీపీ నగర యువజన విభాగ అధ్యక్షుడు బిల్డర్ చిన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ బిల్డర్ చిన్న ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక సేవా కార్యక్రమంలు చేపట్టడం అభినందనీయమన్నారు. మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని మాజీఎంపీ భరత్‌రామ్ సూచించారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు సుధారెడ్డి, మజ్జి అప్పారావు, నందం స్వామి, సప్పా ఆదినారాయణ, గౌషియా, దువ్వాడ శంకర్, బూరా కనకలింగేశ్వరరావు, సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

రాజమహేంద్రవరం సిటీ: వేసవిలో పాదచారులు, ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మానవత సేవా సంస్థ రీజనల్ చైర్మన్, హీరో మోటార్స్ అధినేత చింతా ప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సత్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్య చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తమ్మా రవి, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ పీ. భరద్వాజ, రఘువీర్ శ్రీనివాస్ బళ్లారి ,వాసంశెట్టి వెంకటేశ్వరరావు (బుజ్జి) తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథం



శిబిరంలో రక్తదాతలను అభినందిస్తున్న బొమ్మూరు పీఎస్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథం

రాజమహేంద్రవరం రూరల్: ఉచిత వైద్యశిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథం అన్నారు. ఆదివారం హుకుంపేట పంచాయతీ ఎదురుగా కేపీఆర్ వాటర్‌ప్లాంట్ ఆవరణలో కోటంశెట్టి వెంకాయమ్మ, పెంటారావు, అప్పలనర్సమ్మ జ్ఞాపకార్థం కేపీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కోటంశెట్టి రాజబాబు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలను ప్రారంభించారు. అనంతరం రక్తదాతలను అభినందించి, ఉచిత వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకున్న రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ మృతి చెందిన కుటుంబ సభ్యుల పేరున కేపీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కోటంశెట్టి రాజబాబు ఉచిత మెగా వైద్యశిబిరం, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైద్యులు వీఎస్‌వీఆర్ సతీష్, కె.చాందిని, వీఎస్‌పాపారావు, శ్రీరామ్‌సుధశెట్టి, ప్రణీతశెట్టి వివిధ సమస్యలకు పరీక్షలు చేసి మందులు అందించారు. సత్య సూర్య వాలంటరీ బ్లడ్‌బ్యాంక్ అండ్ బ్లడ్ కాంపొనెంట్స్ వారిచే రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్యశిబిరంలో 108 మంది సేవలు పొందారు.

హిప్నో కమలాకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

కంబాలచెరువు: డాక్టర్ హిప్నో కమలాకర్ ఆశయాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ప్రోగ్రెసివ్ సైకాలజిస్టు అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బీసీ కళాశాల బాలుర హాస్టల్‌లో డాక్టర్ హిప్నో కమలాకర్ జయంతిని ఆదివారం నిర్వహించారు. దీనికి నగర ఎమ్మెల్యేతో పాటు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హిప్నో పద్మా కమలాకర్ మాట్లాడుతూ కమలాకర్ వృత్తినే ఇంటి పేరుగా మార్చుకుని దేశవ్యాప్తంగా హిప్నాటిజం ప్రదర్శనలు చేసి మనిషిలో ఉన్న శక్తి సామర్థ్యాలను నిరూపించిన ఘనత డాక్టర్ హిప్నో కమలాకర్‌కే దక్కుతుందన్నారు. హిప్నాటిజం, సైకాలజీ మేళవించి అనేక మానసిక సమస్యలు నివారించవచ్చని సమాజానికి చాటి చెప్పిన మహా మేధావి అన్నారు. ఈ రోజుల్లో సైకాలజీపై అందరికీ అవగాహన వచ్చిందంటే కమలాకర్ కారణమన్నారు. సామాజిక సమానత్వానికి చైతన్యం తెచ్చేలా 20 వేల కార్యక్రమాలు నిర్వహించి వంద పుస్తకాలు రాసిన గొప్ప రైటర్, మానవతావాది అన్నారు. విద్యార్థులు తార్కిక ఆలోచన, సైన్సుపై ప్రేమ కలిగే విధంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమైనవన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్టులు పి.రమేష్‌కుమార్, రాజేష్, చరితదేవి పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

కంబాలచెరువు: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో రాజమహేంద్రవరం శ్రీచైతన్య విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ముందంజులో నిలిచారని ఆ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఎం.హరిప్రసాద్ ఆదివారం తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 990 మార్కులతో తమ విద్యార్థి గౌరవ్ రాష్ట్రంలో మూడో స్థానం సాధించాడన్నారు. ప్రథమ సంవత్సరంలో తమ విద్యార్థులు మేడపాటి నాగ గణేష్‌రెడ్డి, బొడ్డు సాయిచందన టౌన్ ఫస్ట్‌గా నిలిచారన్నారు. అలాగే 464 మార్కులు ఐదుగురికి, 463 మార్కులు 14 మందికి, 462 మార్కులు 21 మందికి, 461 మార్కులు 50 మంది విద్యార్థులు సాధించారన్నారు. జూనియర్ బైపాస్ విభాగంలో 440కు 436 మార్కులు సాధించిన పెదపూడి సరయు రాష్ట్రంలో రెండో స్థానం సాధించిందన్నారు. ఈ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అందుకు కారకులైన అధ్యాపకులను అభినందించారు.

నగరంలో గావ్ చలో, బస్తీ చలో కార్యక్రమం



అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రపరుస్తున్న సోము వీర్రాజు

రాజమహేంద్రవరం సిటీ: క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేస్తూ, సమాజంలో మనవంతు బాధ్యతగా పార్టీ నిర్దేశించిన వివిధ అంశాలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని ఎమ్మెల్సీ సోమువీర్రాజు పిలుపు నిచ్చారు. ఆదివారం నగరంలో గావ్ చలో, బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అంబేడ్కర్ మహనీయుని విగ్రహాలను శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. జాంపేట సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రంగా కడిగి ప్రమిదలలో దీపాలను వెలిగించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, మాజీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, ఉన్ని కృష్ణ, కురగంటి సతీష్, కొంతం కృష్ణ, బూరా రామచంద్రరావు, పార్టీ ముఖ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాలను శుభ్రం చేసిన బీజేపీనాయకులు

రాజమహేంద్రవరం రూరల్: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా కాతేరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం సాయంత్రం అంబేడ్కర్ విగ్రహాలను శుభ్రం చేశారు. బీజేపీ జాతీయ పార్టీ పిలుపు మేరకు అంబేడ్కర్ విగ్రహాలను శుభ్రం చేసి పరిసర ప్రాంతాలలో స్వచ్ఛభారత్, సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాశీరాజు, రూరల్ నియోజకవర్గ కోకన్వీనర్ యానాపు యేసు, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు దున్న సుమన్‌బాబు, మండల అధ్యక్షుడు నాగుల శివకుమార్, త్రీమెన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుర్తుకొస్తున్నాయి..



ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న అలనాటి మిత్రులు

- 40 ఏళ్ల తర్వాత కలిసిన స్నేహితులు
- ధవళేశ్వరంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ధవళేశ్వరం: నలభై ఏళ్ల క్రితం వారంతా కలిసి చదువుకున్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ద్వారా తిరిగి ఒక చోట కలిశారు. ఈ అపురూప ఘటన ఆదివారం ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్‌లో చోటు చేసుకుంది. 1984-85 సంవత్సరంలో పదో తరగతి చదివిన వీరంతా వివిధ రాష్ట్రలతోపాటు, విదేశాల్లో సైతం స్థిరపడ్డారు. 40ఏళ్ల తర్వాత స్నేహితులను కలిసేందుకు బ్రెజిల్ నుంచి వెంపటి వెంకట శేషగిరి ధవళేశ్వరం వచ్చారు. స్థానికంగా నివాసం ఉంటున్న వారితో పాటు వివిధ రాష్ట్రాల్లో స్థిరపడిన వారంతా కార్యక్రమానికి తరలివచ్చారు. సుమారు 80 మంది ఈ కార్యక్రమంలో కలిశారు. వీరంతా అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం స్థానిక పద్మావతి ఫంక్షన్ హాల్‌లో కలిసి తమ యోగక్షేమాలు, వివరాలను తెలిపారు. అలనాడు తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రతి ఏటా కలుసుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమం జరిగేందుకు అలనాటి మిత్రులు తలారి వరప్రసాద్, షేక్ బాబ్జీ, ఎస్.రామారావు, పుసులూరి శేషుకుమార్, బొంతు సంతోష్, అయితాబత్తుల ప్రసాద్, నారపురెడ్డి మురళి తదితరులు కృషి చేశారు.

వేసవి దుక్కులు.. భూమికి మేలు

- పెరగనున్న భూసారం, పంట దిగుబడి
- తగ్గనున్న తెగుళ్ల బెడద
- బహుళ ప్రయోజనాలు ఉంటాయంటున్న వ్యవసాయాధికారులు



నరేంద్రపురంలో ట్రాక్టర్‌తో పొలాన్ని దుక్కు చేస్తున్న రైతు

రాజానగరం: వ్యవసాయ భూమి సారంగా ఉంటేనే వేసిన పంటలు ఆశించిన దిగుబడి లభిస్తుంది. అలాగని అదే భూమిలో వరుస పెట్టి పంటలు పండిస్తూ భూసారాన్ని విస్మరిస్తే కాలక్రమంలో ఆయా భూములు నిస్సారమయ్యే ప్రమాదం ఉంది. అందుకనే మన పూర్వీకులు ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు పండించిన భూముల్లో వేసవిలో దుక్కులు చేపట్టి, భూసారాన్ని కాపాడుకునే ప్రయత్నం చేసేవారు. ఆధునిక సమాజంలో భూముల్లో పంటలు పండిస్తూ దిగుబడి తీసుకునేందుకు ఎక్కువ మంది రైతులు చూస్తున్నారు తప్ప, భూసారాన్ని వృద్ధి చేయడానికి ప్రయత్నించడం లేదు. రబీ పంట తరువాత వేసవిలో ఆయా భూముల్లో దుక్కులు చేపట్టడం వలన బహుళ ప్రయోజనాలున్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వ్యవసాయంపై మక్కువ, ఆసక్తి ఉన్న రైతులు కొంతమంది పూర్వీకుల పద్ధతులను అనుసరిస్తూనే అధిక దిగుబడులు సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు.

మన పూర్వీకులు ఇలా..

మన పూర్వీకులు ఏ పని చేసినా అప్పటి ప్రయోజనాలతోపాటు భవిష్యత్తు గురించి కూడా ఆలోచించేవారు. ముఖ్యంగా వ్యవసాయంలో భూసారాన్ని కాపాడుకుంటూ నాణ్యమైన పంటలు పండిచే దిశగా అడుగులు వేసేవారు. ఖరీఫ్ సీజన్‌కి సమాయత్తమయ్యే పొలాలలో వేసవిలో దుక్కులు చేపట్టి భూసార పరిరక్షణకు చర్యలు తీసుకునేవారు. కాలక్రమంలో అన్నదాతలు 'ఆధునికత' పేరుతో బిజీ అయిపోయి, వేసవి దుక్కులు చేపట్టడం చాలా వరకూ మానేశారు. అయితే మెట్ట ప్రాంతంలో ముఖ్యంగా వరి సాగులో ముందుండే రాజానగరం మండలం, నరేంద్రపురం, తూర్పుగానుగూడెం, కలవచర్ల, వెలుగుబంద, గండేపల్లి మండలం మురారి, గండేపల్లి తదితర గ్రామాలలో రైతులు చాలా మంది వర్షాలు కురిసిన వెంటనే వేసవి దుక్కులు చేస్తుంటారు. అయితే వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉన్న ప్రస్తుత తరుణంలో దుక్కులు చేయడం ఎలాగని చాలా మంది రైతులకు సందేహాలు రావొచ్చు. అయితే బోర్లు, సాగునీటి సదుపాయాలు ఉన్నవారు ఇప్పటికే వేసవి దుక్కులు ప్రారంభించారు. మిగిలిన వారు వర్షాలు పడిన వెంటనే చేపట్టవచ్చు. వేసవిలో దుక్కులు చేపట్టి, పశువుల పెంట వేయడం ద్వారా ఆయా భూములలో భూసారం వృద్ధి చెంది, తద్వారా సాగు చేసే పంటలు మంచి దిగుబడిని అందిస్తాయి.

వేసవి దుక్కులు - ప్రయోజనాలు

- వేసవిలో పొలాలను దుక్కు చేయడం వలన ఆయా పొలాలలో పెరిగిన గడ్డి నశించిపోవడంతోపాటు వరి మోళ్లు కుళ్లి భూమిలో కలిసిపోయి ఎరువులుగా మారతాయి.
- భూమిలో ఉండే వివిధ రకాల పురుగులు పైకి రావడం వలన వాటిని పక్షులు ఆహారంగా తీసుకుని, తదుపరి వేసే పంటలకు నష్టం వాటిల్లకుండా నివారిస్తాయి.
- అలాగే పక్షులు ఆహారంగా తీసుకోగా మిగిలిన పురుగులు వేసవి ఎండల తీవ్రతకు చనిపోతాయి. తద్వారా ఆయా పొలంలో పురుగుల ఉధృతి తగ్గుతుంది,
- అలాగే తెగుళ్లకు కారణమయ్యే శీలింద్రాలు కూడా ఈ ఎండలకు చనిపోడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ విధంగా తరువాత సాగు చేసే పంటలకు తెగుళ్ల బెడద లేకుండా నివారించవచ్చు,
- రైతు ఇదే సమయంలో దుక్కు చేసిన పొలాలలో పచ్చిరొట్ట విత్తనాలను చల్లితే భూమి సారాన్ని కూడా పెంపొందించుకునేందుకు అవకాశం ఉంటుంది.

వేసవి దుక్కులు మంచివి

నూరగా నూరగా రాళ్ళు కూడా పిండైపోతుంటాయి. అలాగే మన పొలాలు కూడా విరామం లేకుండా పంటలు పండిస్తూ పోతుంటే వాటిలో సారం కరిగిపోయి, నిస్సారంగా తయారవుతాయి. అయితే ఈ సమస్యను నివారించేందుకు పొలాలలో వేసవి దుక్కులు చేపట్టడం ఎంతో అవసరం. రబీ పంట తరువాత అపరాలు సాగు చేసే భూములలో కాకుండా ఖాళీగా ఉంచిన పొలాలలో వేసవి దుక్కులు చేయడం చెడు పురుగులు, శీలింద్రాలు చనిపోవడంతోపాటు, గడ్డి, గరప కుళ్లి నేల సారవంతంగా తయారవుతుంది. తెగుళ్ల బెడద చాలా వరకు ఉండదు. తద్వారా దిగుబడి బాగుంటుంది.

– ప్రగడ రాంబాబు, రైతు, నరేంద్రపురం

పూర్వీకులకు ముందు చూపు

పూర్వీకులు ఏ పని చేసినా ముందు చూపుతో చేసేవారు. వ్యవసాయంలో వారు అనుసరించి అనేక పద్ధతులు నేటికీ ఆచరణీయంగానే ఉన్నాయి. అటువంటి వాటిలో మన పంటలు పండిచే పొలంలో వేసవి దుక్కులు చేపట్టడం ఒకటి. దీని వలన ఆయా భూమిలో ఉండే చెత్తాచెదారాలు, కలుపులు అన్నీ పెకలించబడి, ఆపై కురిసే వర్షపు చినుకులకు అవి కుళ్లి భూసారం పెరుగుదలకు తోడ్పడతాయి. అదే సమయంలో మనం కూడా పశువుల పెంటను చల్లితే మరింత సారవంతమవుతాయి.

– పాలచర్ల వెంకటరమణ, రైతు, మురారి